GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout's, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

Happy 75th Independence Day
# క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
మంగళవారం 23-06-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్



# నల్లగొండలో కలకలం

- అనుమానాస్పద స్థితిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి
- మృతిపై పలు అనుమానాలు, వివిధ కోణాల్లో పోలీసుల దర్యాప్తు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ, ఏఎస్పీ
- ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు

నీలగిరి, జూన్ 22: నల్లగొండ పట్టణ శివారులోని తెలంగాణ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడంతో కలకలం రేగింది. కుటుంబ సభ్యులంతా అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో పాటు రక్తపు మరకలు ఉండటం, గేటుకు బయటి నుంచే తాళం వేసి ఉండటంతో వారి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. కాలనీ వాసులు, స్థానిక కార్పొరేటర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో




ఘటనా స్థలానికి వచ్చి ఇంటి బయట గేటు తాళం పగులగొట్టి లోపలికి వెళ్లి చూశారు.

మృత దేహాలు నాలుగూ కుళ్లిపోయి ఉండటాన్ని గుర్తించారు. వివరాల్లోకి వెళితే నల్లగొండ ప్రకాశం బజార్‌లోని ఓ ప్రైవేట్ దుకాణంలో పనిచేస్తున్న మహ్మద్ సుల్తాన్ (45) భార్య గతంలో చనిపోయింది. ఆయనకు ఇద్దరు పిల్లలు. కుమారుడు ముజామ్మిల్ (20), కూతురు అప్సర్(14) ఉన్నా రు. సుల్తాన్ మొదటి భార్య చనిపోవడంతో విడాకులు తీసుకొని ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న హసీనాను (41) రెండో వివాహం చేసుకున్నాడు. కాగా వీరు మూడు రోజుల క్రితమే మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చా రు.

# గాలివాన బీభత్సం

- మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో విరిగిపడ్డ చెట్లు
- రాకపోకలకు అంతరాయం
- స్తంభాలు నేలకొరిగి నిలిచిన విద్యుత్ సరఫరా
- లేచిపోయిన రేకుల షెడ్లు
- కొండపల్లిలో పిడుగుపడి మేక మృతి

2లో



# ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు

- ఈ నెల 28న పల్స్ పోలియో.. జిల్లాలో 76,365 మంది గుర్తింపు
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ కుమార్ దీపక్

3లో



# హత్యకేసులో తల్లే నిందితురాలు

**బాలుడు హత్య కేసును ఛేదించిన కీసర పోలీసులు**
**తల్లి సహా మరో నిందితుడి అరెస్టు, రిమాండ్**




కీసర, జూన్ 22 : రెండేళ్ల బాలుడి మర్డర్ కేసును ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశామని ఏసీపీ చక్రపాణి తెలిపారు. సోమవారం కీసర పోలీసుస్టేషన్‌లో ఏసీపీ చక్రపాణి, కీసర సీఐ ఆర్కేపల్లి ఆంజనేయులు కలిసి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట్ జిల్లా తీగల్ ప్రాంతానికి చెందిన క్యాబ్ డ్రైవర్ రంగస్వామి కీసర సర్కిల్ చీర్యాల్‌లోని ఈడెన్ గార్డెన్‌లో తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. తన కుమారుడు మాస్టర్ రంగా హరికృష్ణ (2) అనుమానాస్పదస్థితిలో మరణించిన్నట్లు ఈనెల 13న ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుతో గత నెల 29న మృతుడి తల్లి రంగా జ్యోతి తన కుమారుడు పడిపోవడం వల్ల అపస్మారక స్థితిలోకి వెళితే దవాఖానకు తరలిస్తే అప్పటికే మృతిచెందిన్నట్లు వైద్యులు నిర్ధారించారని తెలపడంతో అనుమానం వచ్చిన స్వామి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ పుటేజీలు, సాక్ష్యుల వాంగ్మూలాల ఆధారంగా నిందితుడు ముగిళ్ల నవీన్‌కు రంగా జ్యోతికి వివాహేతర సంబంధం ఉన్నట్లు వెల్లడైందని, సంఘటన జరిగిన రోజు నిందితుడు నవీన్, జ్యోతిలు కలిసి బాలుడి గొంతు నులిపి చంపేశారని వారిద్దరు ఒప్పుకున్నారని తెలిపారు. ఈనెల 19న తీగల్‌లో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికి తీసి పోరెన్సిక్ పరీక్షలు నిర్వహించామన్నారు. వారిద్దరి వివాహేతర సంబంధానికి మృతుడు అడ్డుగా ఉన్నాడని బాలుడిని హత్య చేసిన్నట్లు తమ విచారణలో వెల్లడైందని తెలిపారు. హత్య కేసులో యాదాద్రి-భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మాధాపూర్‌కు చెందిన మొగుళ్ళ నవీన్ (28), రంగా జ్యోతిలను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఆర్కేపల్లి ఆంజనేయులు, ఎస్సైలు హరిప్రసాదవ్, శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సం

**మంచిర్యాల, (క్రైమ్ మిర్రర్):** జిల్లాలో సోమవారం గాలివాన బీభత్సం సృష్టించింది. నెన్నెల మండలంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడగా, చెట్లు, కరెంట్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తహసీల్దార్ కార్యాలయం, పీహెచ్‌సీకి వెళ్లే దారిలో రెండు భారీ వృక్షాలు పడిపోగా, రాకపో కలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లంబాడీతండా లోని పలు ఇండ్ల పై రేకులు ఎగిరిపోయాయి. నెన్నెల సర్పంచ్ ఇబ్రహీం విరిగి పడిన చెట్లను జేసీబీ సాయంతో తొలగింపజేయగా, రాకపోకలు సాగాయి. వేమనపల్లి మండలం జిల్లెడ, జక్కెపల్లి, బుయ్యారం, సూరారం, నాగారం, చామనపల్లి గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం గంటపాటు భారీ వర్షం కురిసింది. నాగారం నుంచి మంగెనపల్లి వరకు ఉన్న మట్టి రోడ్డు బురదమయంగా మారడంతో పాటు గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వా హనదారులు ఇబ్బందులు పడ్డారు. జిల్లెడ సమీపంలోని బెల్లంపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న గుంతల్లో వర్షం నీరు చేరగా, వాహనదారులు గుంతల్లో అదుపు తప్పి పడ్డారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో వేప చెట్టు కూలి ఇండ్ల మధ్యన పడింది. ాయ బాన య్యకు చెందిన ఇల్లు కూలిపోయింది. మొక్కంపల్లిలో మోర్ల వసంతకు చెందిన ఇంటి రేకులు ఎగిరిపోయాయి. తాండూర్ మండలం కాసిపేట గ్రామానికి చెందిన కొండపల్లి గంగా ఇంటి ప్రహరీ వర్షానికి కూలిపోయింది. కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. బాధి త కుటుంబం నష్టపోవడంతో సంబంధిత అధికారులు స్పందించి సాయమందించాలని గ్రామస్తులు కోరుతు న్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండ లంలో ఉరుములు మెరుపులతో కూడిన గాలివాన పడిం ది. అక్కడక్కడా విద్యుత్ స్తంభాలు పడిపోయి సరఫరా నిలిచిపోయింది. పలుచోట్ల ఇండ్ల పై రేకులు లేచిపోయి నాయి. పెంచికల్‌పేట్ మండలం పోతపల్లిలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాలో అంతరా యం కలిగింది. కొండపల్లిలో ఉషనబోయిన సంతోశ్ ఇం టి పై రేకులు గాలికి కొట్టుకుపోయా యి. ఇంట్లోని సామ గ్రి తడిసింది. అక్కడక్కడా చెట్లు నేలకొరిగాయి. అగర్‌గూ డ గ్రామ పరిధిలోని ఆగర్‌గూడలో రాంటెంకి పోచయ్యే అనే రైతుకు చెందిన మేక పిడుగుపాటుకు మృతి చెందిం ది. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని ఆయన వేడుకుంటున్నాడు. కాగా, ఈ వర్షం పంటల సాగుకు అనుకూలమంటూ పలువురు రైతులు పేర్కొన్నారు.

## విధి నిర్వహణలో ఆదర్శంగా నిలిచిన ఎస్సై పి. సంతోష్‌కు ఘన సన్మానం


**క్రైమ్ మిర్రర్ పాలేరు నేలకొండపల్లి జూన్ 22:** నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో దాదాపు 22 నెలల పాటు ఎస్సైగా విధులు నిర్వహించి, ఇటీవల ఖమ్మం పట్టణానికి బదిలీపై వెళ్తున్న ఎస్సై పి. సంతోష్‌కు స్థానిక జర్నలిస్టులు ఘన సన్మానం నిర్వహించారు. శాలువాతో సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ, ఎస్సై పి. సంతోష్ తన పదవీకాలంలో ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడకుండా వ్యవహరించడమే కాకుండా, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. ముఖ్యంగా తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరాలు నిర్వహించి అనేక మంది రోగులకు ప్రాణదాతగా నిలిచారని ప్రశంసించారు. అలాగే యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా గంజాయి నిర్మూలనపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టి సామాజిక బాధ్యతను చాటారని కొనియాడారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, అంకితభావం, మానవతా దృక్పథంతో పనిచేసిన ఎస్సై పి. సంతోష్ సేవలు నేలకొండపల్లి ప్రజలకు చిరస్మరణీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకుని పోలీసు శాఖలో విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు. సన్మానానికి స్పందించిన ఎస్సై పి. సంతోష్, తనకు సహకరించిన ప్రజలు, సహోద్యోగులు, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశీస్సులు, సహకారం తనకు ఎల్లప్పుడూ ప్రేరణగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా వాయిస్ జిల్లా స్టాఫర్ దుద్దేల సంజయ్, న్యూస్‌లైన్ తెలంగాణ జిల్లా ఇన్‌చార్జి అవుట మధు, ఆర్‌టీవీ పాలేరు రిపోర్టర్ కోలేటి నారాయణ, బిగ్ టీవీ పాలేరు రిపోర్టర్ తుమాటి ఉపేందర్, వే టూ న్యూస్ ప్రతినిధి బద్రి రేఖ పాల్గొన్నారు.

# నల్లగొండలో కలకలం

(మొదటి పేజీ తరువాయి)

ఇది హత్యా..? ఆత్మహత్యా..? అన్న కోణంలో వన్ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు ముందు ఇంట్లో ఘర్షణ జరిగినట్లు స్థానికుల చెబుతున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు యంత్రాంగం, క్లూస్ టీమ్, ఆధారాల సేకరించి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ సంఘటనకు సంబంధించి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కాగా విషయం తెలియడంతో ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఏఎస్పీ రమేష్ సంఘటన స్థలానికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితమే వీరు మరణించడంతో శవాలు గుర్తించలేని స్థితిలో ఉన్నాయని, దర్యాప్తు వేగవంతం చేశామని, త్వరలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తామన్నారు. ఘటనకు సంబంధించి పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆ నలుగురి మృతికి కారణాలు తెలియకపోవడంతో పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. ఏసీ మెకానిక్‌గా పనిచేసే ముజమ్మిల్ ఎప్పుడూ కుటుంబ గొడవలు ఉన్నాయని, వాటితో సతమతమవుతున్నానం టూ స్నేహితులతో అనేవాడని తెలిసింది. ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండటం, దొంగతనం చేసినట్లుగా వస్తువులు కింద పడేసి ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

# అక్రమ కట్టడాలపై అడిషనల్ కలెక్టర్ కు ఫిర్యాదు



**చౌటుప్పల్,జూన్ 22,క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ నుండి నాగారం వలిగొండ రోడ్డులోని సర్వే నెంబర్ 175,176 లో ప్రవహిస్తున్న మొండికుంట కాలువ ఆక్రమణ గురించి సోమవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ కి చెందిన బీజేపీ కౌన్సిలర్ లు బుద్ధ సురేష్, జిల్లా కార్యదర్శి ఆలే చిరంజీవి, మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు వంగాల రమాకాంత్ గౌడ్ లు యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ లో అడిషనల్ కలెక్టర్ భాస్కరరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చౌటుప్పల్ - నాగారం వలిగొండ రోడ్ లో సర్వే నంబర్ 175, 176 లోని మొండికుంట కాలువ స్థలంలో జరుగుతున్న అక్రమ కట్టడాలపై ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్కు పిర్యాదు పత్రం ఇవ్వడం జరిగిందన్నారు.గత 2020 సంవత్సరంలో మొండికుంట కాలువ స్థలం ఆక్రమణ గురించి అప్పటి కమిషనర్ రామ్ దుర్గా రెడ్డి ,కలెక్టర్ లకు విన్నవించగా వారు 100 మీటర్ ల పొడవుతో కల్వర్టు నిర్మాణం మరియు 100 ఫీట్ ల వెడల్పు తో మొండికుంట కాలువ నిర్మాణం జరుగుతుంది అని చెప్పి మొండికుంట కాలువ స్థలంను ఆక్రమించి నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయడం జరిగిందని గుర్తు చేశారు . కానీ అదే చోట ఇప్పుడు మళ్లీ కనీసం 20 మీటర్ ల పొడవు కూడా లేకుండా కల్వర్టును పునర్నిర్మానం చేయడం జరుగుతుందన్నారు. చౌటుప్పల్ పట్టణ 80% కు పైగా మురుగునీరు, వర్షపు నీరు వలిగొండ రోడ్ లోని మొండికుంట కాలువ గుండా ప్రవహిస్తుంది కనుక భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా 100 మీటర్ల పొడవుతో కల్వర్టు పూర్వపు యథాస్థితి ఉండేలా నిర్మాణం చేపట్టాలని కోరారు.



# కాళేశ్వరంలో..'ప్రకాష్ రెడ్డి ప్రత్యేక పూజలు'..!!

- రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. దేవస్థానానికి చేరుకున్న అయిత ప్రకాష్ రెడ్డి దంపతులకు ఆలయ అర్చకులు, దేవస్థాన అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టత, చారిత్రక ప్రాధాన్యత గురించి దేవస్థాన అర్చకులు వివరించారు. దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, దేవస్థానం తరపున తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాళేశ్వరం సర్పంచ్ మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ సుధీర్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## జైపూర్‌లో కమ్యూనిటీ భవనానికి భూమిపూజ

- రూ. 25 లక్షల 'సీఎస్ఆర్' నిధులతో నిర్మాణం
- శంకుస్థాపన చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి

**మంచిర్యాల జూన్ 22 (క్రైమ్ మిర్రర్):** జైపూర్ మండల కేంద్రంలో రూ. 25 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న నూతన కమ్యూనిటీ భవనానికి రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి భూమిపూజ చేశారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఆయన ఆదివారం ఈ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సామాజిక, సాంస్కృతిక అవసరాలను తీర్చేందుకు కమ్యూనిటీ భవనాలు ఎంతో దోహదపడతాయన్నారు. సీఎస్ఆర్ నిధులను ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించడం వల్ల గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని పేర్కొన్నారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. స్థానికులు సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఈ భవనం వేదికగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# ఆర్టీఓ కార్యాలయం వద్ద ఘోర ప్రమాదం..!!

- లారీ ఢీకొని జిల్లా రవాణా అధికారి అక్కడికక్కడే మృతి
- సీజ్ చేసిన హార్వెస్టర్ ప్రవేశపెడుతుండగా ప్రమాదం
- ప్రమాదంపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** భూపాలపల్లి జిల్లా చెల్పూర్‌లోని ఆర్టీఓ కార్యాలయం సమీపంలో సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో జిల్లా రవాణా అధికారి (డీటీఓ) వెంకన్న మృతిచెందారు. విధి నిర్వహణలో భాగంగా వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్న సమయంలో ఈ విషాద ఘటన చోటుచేసుకోవడం జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మార్ల ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన బొగ్గు లోడ్‌తో వెళ్తున్న లారీ (టీఎస్22టీ2687)ను మహ్మద్ తస్లీమ్ నడుపుతూ జెన్‌కో వైపు వెళ్తున్నాడు. ఇదే సమయంలో జిల్లా రవాణా అధికారి వెంకన్న తమ అధికారిక వాహనం (టీఎస్03ఎఫ్జి3339) నుంచి దిగి, ఆర్టీఓ కార్యాలయ ప్రాంగణంలోకి సీజ్ చేసిన హార్వెస్టర్ వాహనాన్ని ప్రవేశపెట్టేందుకు రోడ్డుపై వాహనాల రాకపోకలను నియంత్రించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనాన్ని నడుపుతూ డీటీఓ వెంకన్నను ఢీకొట్టాడు.



ప్రమాద తీవ్రతకు ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడిపాడా లేదా అనే అంశంతో పాటు ప్రమాదానికి దారితీసిన ఇతర కారణాలపై కూడా అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ స్పందిస్తూ, ప్రమాదానికి సంబంధించిన అన్ని వివరాలను సమగ్రంగా పరిశీలించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు

- ఈ నెల 28న పల్స్ పోలియో.. జిల్లాలో 76,365 మంది గుర్తింపు
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల,జూన్ 22 (క్రైమ్ మిర్రర్):** జిల్లాలో ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, వాతావరణ మార్పుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్లలోపు 76,365 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 459 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాటిలో పట్టణ ప్రాంతాల్లో 86, గ్రామీణ ప్రాంతాల్లో 353, గిరిజన ప్రాంతాల్లో 20 కేంద్రాలు ఉన్నాయి. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో 24 ట్రాన్సిట్ బృందాలు, మారుమూల ప్రాంతాల కోసం 24 మొబైల్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ నెల 28న కేంద్రాల ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు, మిగిలిపోయిన చిన్నారులకు 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి వ్యాక్సిన్ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 1,836 మంది ఆశా, అంగన్‌వాడీ, ఆరోగ్య, వైద్య సిబ్బంది పాల్గొంటారని చెప్పారు. ఒక్క చిన్నారి కూడా మిగలకుండా విస్తృత ప్రచారం చేపట్టి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం, వాతావరణ మార్పుల కారణంగా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి కీటక జనిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, విద్యాశాఖ, డీఆర్‌డీఏ తదితర శాఖలు సమన్వయంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో





సర్పంచులు, పట్టణాల్లో వార్డు సభ్యులను భాగస్వామ్యం చేస్తూ దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి మండలంలో రాపిడ్ రెస్పాన్స్ బృందాలను సిద్ధంగా ఉంచాలని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. డెంగ్యూ కేసులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజల్లో భయాందోళనలు కలగకుండా ప్రైవేట్ ఆసుపత్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం పల్స్ పోలియో కార్యక్రమం, సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన పోస్టర్లు, బ్యానర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీరాములు, డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుధాకర్ నాయక్, డాక్టర్ ప్రసాద్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, డీపీహెచ్‌ఎన్ పి.ఎస్. పద్మ, నాందేవ్, శ్రీనివాస్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# మూడు జిల్లాలకు రాష్ట్ర జాయింట్ కన్వీనర్ గా భోగ రవికుమార్

**క్రైమ్ మిర్రర్ కోరుట్ల ప్రతినిధి, జూన్ 22:** భారతీయ జనతా పార్టీ (బిజెపి) ధార్మిక విభాగం (ఎండోమెంట్ సెల్) తెలంగాణ స్టేట్ జగిత్యాల జిల్లా,కామారెడ్డి జిల్లా,సిరిసిల్ల జిల్లా మూడు జిల్లాలకు రాష్ట్ర జాయింట్ కన్వీనర్ గా భోగ రవికుమార్ నియామకమయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షుడు (భాజపా) ఎన్. రామచంద్రరావు ఆదేశానుసారము నియమకాన్ని ప్రకటిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. గౌతమ్ రావు,రాష్ట్ర ధార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ అన్నవజ్జుల సూర్య ప్రకాష్, కో కన్వీనర్



నిరంజన్, దేశాయ్ లు తెలిపినారు ఈ మేరకు భోగ రవికుమార్ మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన బాధ్యతలను ఆలయంలో ధార్మిక కార్యక్రమాలను విస్తృతం చేస్తూ పాటుపడతానని తెలిపినారు ఈ కార్యక్రమంలో అతనికి సాల్వతో సన్మానించినవారు ముక్క దాము,అడవాల ప్రభాకర్, సంపేట మల్లయ్య, మ్యాకల రాజన్న,ఎడల్లి రాజారాం, లక్కాకుల విజయ్, అడవాల అక్షయ, సాంబార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు వేదికల్లో విత్తన మేళా ప్రారంభం : చందుపట్ల రాజిరెడ్డి


- నేటి నుంచి 30 వరకు రైతు వేదికల్లో విత్తన మేళా
- నాణ్యమైన విత్తనాల విక్రయం
- రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడం, పంటల దిగుబడిని పెంచడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు వేదికలలో విత్తన మేళాలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో భూపాలపల్లి జిల్లాలోని రైతు వేదికల్లో జూన్ 23 నుండి జూన్ 30 వరకు విత్తన మేళా నిర్వహించనున్నట్లు పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విత్తన మేళాలో వివిధ రకాల పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా వరి, కంది, పెసర, సోయాబీన్, పత్తి, కూరగాయల విత్తనాలతో పాటు పంటల సంరక్షణకు అవసరమైన ఉత్పత్తులను కూడా ప్రదర్శనకు ఉంచుతున్నారు. రైతులు నేరుగా రైతు వేదికలకు వచ్చి తమ అవసరాలకు అనుగుణంగా విత్తనాలను కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. వ్యవసాయ నిపుణులు రైతులకు పంటల ఎంపిక, విత్తనాల వినియోగం, ఎరువుల నిర్వహణ, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించనున్నారు. నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులపై ప్రత్యేక ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేయనున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విత్తనాలను పొందడంతో పాటు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని అధికారులు కోరారు.

# కోరుట్లలో పురాతన రహదారి కబ్జాపై ఆర్డీవో జీవాకర్ రెడ్డి కి పిర్యాదు చేసిన డా. పేట భాస్కర్

**- సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాలని తహశీల్దార్ ను ఆదేశించిన ఆర్డీవో**



**క్రైమ్ మిర్రర్ కోరుట్ల ప్రతినిధి జూన్ 22:** కోరుట్లలోని పురాతన రోడ్డు ( పాత గుంలాపూర్ రోడ్డు) సాయిబాబా దేవాలయం వెనుక ఒర్రె కాలువను అనుకొని వున్న పాత హద్ది రాస్తా ప్రస్తుతం మారేమ్మ దేవాలయం రోడ్డును సర్వే నెంబర్ 742 కు చెందిన చింత వెంకట నర్సయ్య కుమారులు ప్రభుత్వ ఉద్యోగులు అయి ఉండి ప్రభుత్వ రోడ్డును చదును చేసి దానిలో కందకాలు తవ్వి ప్లాట్లుగా మార్చి అమ్మకానికి పెడుతున్నారని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ ఆరోపిస్తూ సోమవారం ప్రజావాణిలో మాదిగ కుల సంఘం అధ్యక్షుడు శనిగారపు రాజేష్ తో కలిసి కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి జీవాకర్ రెడ్డికి పిర్యాదు చేశారు. పట్టణంలోని అంబేద్కర్ రోడ్ నుండి వాగు మీదిగా మహాలక్ష్మి దేవాలయం, మడేలయ్య, పెద్దమ్మ, మారేమ్మ దేవాలయాలకు వెళ్లే భక్తులతో పాటు రైతులు వాడుకునే రోడ్డును ఇష్టం వచ్చినట్టు రియల్టర్లతో కుమ్మక్కై ప్రభుత్వ ఉద్యోగులే ఈ తతంగం చేయడం రహదారి కబ్జాకు పాల్పడడం దుర్మార్గపు చర్యగా పిర్యాదు లో పేర్కొన్నారు. ఈసందర్భంగా స్పందించిన ఆర్డీవో జీవాకర్ రెడ్డి రహదారి కబ్జా చేస్తున్న వారిపై విచారణ జరిపి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, అనవాయితీ గా ప్రస్తుతం మహాలక్ష్మి,పెద్దమ్మ, మారేమ్మ బోనాలు తీసే భక్తులకు ఇబ్బందులకు గురి కాకుండా వెంటనే రహదారి సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయించాలని కోరుట్ల తహశీల్దార్ కు ఆదేశాలు జారీ చేశారు.

# ఎంసీసీ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌కు హెచ్ఎంఎస్ వినతి



**మంచిర్యాల, జూన్ 22 (క్రైమ్ మిర్రర్):** ఒకప్పుడు వేలాది మందికి ఉపాధి కల్పించి జిల్లా పారిశ్రామికాభివృద్ధికి దోహదపడిన మంచిర్యాల సిమెంట్ కంపెనీ (ఎంసీసీ)ని పునరుద్ధరించాలని హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఎంసీసీ మూతపడటంతో కార్మికులు,వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని శ్రీనివాస్ తెలిపారు. స్థానిక యువత ఉపాధి అవకాశాలు కోల్పోయిందన్నారు. కంపెనీకి చెందిన సుమారు 438 ఎకరాల పారిశ్రామిక భూమిని ఇతర అవసరాలకు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.పరిశ్రమ కోసం కేటాయించిన భూమిని పరిరక్షించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం లేదా సింగరేణి కాలరీస్ కంపెనీ ఆధ్వర్యంలో ఎంసీసీని స్వాధీనం చేసుకుని తిరిగి ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.కార్మికులకు రావాల్సిన జీతాలు, పీఎఫ్,గ్రాట్యుటీ తదితర బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కార్మిక సంఘాలు,ప్రజా సంఘాలు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి ప్లాంట్ భవిష్యత్తుపై చర్చించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు. రామగుండం ఎరువుల కర్మాగారం,కాగజ్‌నగర్ పేపర్ మిల్లు పునరుద్ధరణకు ప్రభుత్వం చూపిన చొరవ మాదిరిగానే ఎంసీసీని కూడా పునరుద్ధరిస్తే వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షుడు ఎం.డి. షఫీ, జిల్లా కార్యదర్శి తగరం శ్రీనివాస్, నాయకులు ఎం.డి. ఉస్సేన్, దున్నపోతుల రమేష్, పల్లపు శ్రీనివాస్, చల్ల మోహన్, చిప్పకుర్తి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన జీవనశైలికి వ్యాయామమే కీలకం: మంత్రి వివేక్ వెంకటస్వామి



నూతన మారుతి పవర్ జిమ్‌ను ప్రారంభించిన మంత్రి

**రామకృష్ణాపూర్,జూన్ 22(క్రైమ్ మిర్రర్):** యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంలో వ్యాయామం కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్ర కార్మిక,ఉపాధి,గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు.క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలోని 9వ వార్డు ఆర్‌కేపీ ఎక్స్‌రోడ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ మారుతి పవర్ జిమ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే నిత్య వ్యాయామం తప్పనిసరి అని అన్నారు.శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో జిమ్‌లు,క్రీడా కార్యకలాపాలు ముఖ్యపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.యువత వ్యాయామాన్ని దినచర్యలో భాగంగా మార్చుకుని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని సూచించారు.అనంతరం జిమ్‌లో ఏర్పాటు చేసిన ఆధునిక వ్యాయామ పరికరాలను పరిశీలించిన మంత్రి, నిర్వాహకులను అభినందించారు. యువతకు అవసరమైన సౌకర్యాలతో జిమ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓఆర్బీఐ ఉన్నతి క్యాబేజీ విత్తనాలతో రైతుకు రూ.10 లక్షల నష్టం.. న్యాయం చేయాలని ఆవేదన

**క్రైమ్ మిర్రర్ చేవెళ్ల:** చేవెళ్ల మండలం పామెన గ్రామానికి చెందిన రైతు దావల్గారి నరేందర్ రెడ్డి ఓఆర్బీఐ (గ్రా=దీ×) కంపెనీకి చెందిన ఉన్నతి వెరైటీ క్యాబేజీ విత్తనాలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయినట్లు ఆరోపించారు. నర్సరీ నుంచి నారు తెచ్చి ఎకరం విస్తీర్ణంలో సుమారు 30 వేల మొక్కలు నాటగా, పంట కాయ దశకు వచ్చేసరికి పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. ఈ విషయాన్ని కంపెనీ ప్రతినిధులు, నర్సరీ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లగా మొదట కంపెనీ ప్రతినిధి వచ్చి పరిశీలించి, కంపెనీకి నివేదించి నష్టపరిహారం వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు రైతు పేర్కొన్నారు. అయితే 15 రోజుల తరువాత అదే అధికారి వచ్చి ఎలాంటి నష్టపరిహారం చెల్లించలేమని, ఎక్కడైనా ఫిర్యాదు చేసుకోవచ్చని చెప్పి బెదిరించినట్లు ఆరోపించారు. క్యాబేజీకి ప్రస్తుతం మార్కెట్‌లో మంచి ధర ఉండటంతో పంట సక్రమంగా వచ్చి ఉంటే సుమారు రూ.8 లక్షల వరకు ఆదాయం వచ్చేదని రైతు తెలిపారు. ఇప్పటికే సాగు కోసం రూ.1 లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకు ఖర్చు చేశానని, మొత్తం కలిపి దాదాపు రూ.10 లక్షల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనాల నాణ్యత లోపం కారణంగానే పంట దెబ్బతిన్నదని ఆరోపించిన రైతు, సంబంధిత అధికారులు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



# ఎస్ఐఆర్ అనేది ఎన్నికల సంఘం ముఖ్య విధి

**కాంగ్రెస్,బిఆర్ఎస్,ఎంఐఎం పార్టీలు అసత్య ప్రచారం మానుకోవాలి..**

**బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మద్దిపెల్లి సత్యమ్.**



**జగిత్యాల జిల్లా బ్యూరో(క్రైమ్ మిర్రర్):** పెగడపెల్లి:రాజ్యాంగం ప్రకారం ఎస్ఐఆర్ అనేది ఎన్నికల సంఘం విధినిర్వహణలో ముఖ్య భాగమని ప్రత్యేక సమగ్ర సవరణ అనే ప్రక్రియ ప్రజాస్వామ్యానికి ఆయువు పట్టు లాంటిదని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మద్దిపెల్లి సత్యమ్ అన్నారు. ఇంతటి పవిత్ర కార్యక్రమాన్ని కుటుంబ పార్టీలు అయినటువంటి కాంగ్రెస్,ఎంఐఎం, బిఆర్ఎస్ పార్టీలు బిజెపి పార్టీ ఎన్నికల సంఘం కలిసి ముస్లింల, క్రైస్తవుల, ఎస్సీ, ఎస్టీ, మహిళల ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించడానికి ఎన్నికల్లో గెలుపు మార్గాల కోసం విష ప్రచారం చేస్తున్నాయని అన్నారు. ఒకవేళ అదే నిజమైతే ఒక్క కేసు ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఎందుకు నమోదు కాలేదని నమోదైన ఎందుకు కోర్టు ముందు నిలువలేకపోయిందని ప్రశ్నించారు.ఇన్ని రోజులు దొంగ ఓట్లతో బోగస్ ఓట్లతో గెలవడానికి ఉచితాల పేరిట అడ్డగోలుగా హామీలు ఇచ్చి బంగ్లాదేశ్, పాకిస్తాన్,మయన్మార్ లాంటి దేశాల నుండి వచ్చిన అక్రమ చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించి ఓటు బ్యాంకుగా మలుచుకున్నాయని అన్నారు. అక్రమ చొరబాటుదారులు, చనిపోయిన, చిరునామా మారిన వారి ఓట్లు మరియు డబుల్ త్రిబుల్ ఓట్ల తొలగింపు కార్యక్రమం ఎన్నికల సంఘం రాజ్యాంగ బద్ధంగా నిర్వహిస్తుంటే బిజెపి మద్దతుతోనే ఎన్నికల సంఘం ఓట్ల తొలగింపు కార్యక్రమం చేపట్టిందని ఆరోపణలు చేయడం సరికాదన్నారు.గత 12 సంవత్సరాల నుండి బిజెపి ప్రభుత్వం కేంద్రంలో ఉండగా అక్రమ చొరబాటుదారులు ఎలా వచ్చారని ప్రశ్నించడం సిగ్గుచేటని అన్నారు. అక్రమ చొరబాటుదారులు వచ్చింది 12 ఏళ్ల కాలం నుండి కాదని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాలలో కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు పాకిస్తాన్, బంగ్లాదేశ్,మయన్మార్ దేశాల నుండి వచ్చిన అక్రమ చొరబాటుదారులకు ఎర్ర తివాచి పరచి స్వాగతం పలకడం వల్లనే ఇలాంటి పరిస్థితి దాపురించిందని అన్నారు. సర్ అనేది భారత ఎన్నికల వ్యవస్థలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగమని ఇది కొత్తగా నరేంద్ర మోడీ ప్రధాని అయ్యాక తీసుకొచ్చిన విధానం కాదని స్పష్టం చేశారు. భారత ఎన్నికల సంఘం ఇప్పటివరకు 11 సార్లు సర్ ప్రక్రియను నిర్వహించిందని తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కూడా ఎన్నికల సంఘం అనేకసార్లు సర్ నిర్వహించిందని గుర్తు చేశారు. మధ్యప్రదేశ్లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారిని ఉరితీయాలని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించడం రాజ్యాంగ ప్రతిపత్తి గల ఎన్నికల సంఘాన్ని అవమానించడమేనని అన్నారు. 135 సంవత్సరాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి నామినేషన్ పత్రం పూర్తి చేయరాకపోవడం దురదృష్టకరమని అన్నారు. నరేంద్ర మోడీ ప్రధాని అయ్యాక సరిహద్దుల్లో భారత భూభాగం లోనికి చైనా చొచ్చుకు వచ్చిందని తప్పుడు ప్రచారం చేసి దేశ సార్వభౌమత్వాన్ని కించపరిచేలా మాట్లాడిన పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ ని ఉరితీయాలని డిమాండ్ చేశారు.ఈసమావేశంలో మండల అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి మండల నాయకులు కాశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన రైతులకు ఉచిత వరి విత్తనాల పంపిణీ

**క్రైమ్ మిర్రర్,మంగపేట:** రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క సహకారంతో వివేక రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్ పి ఓ) ఆధ్వర్యంలో అన్నపూర్ణ సీడ్స్ అండ్ ఫామ్స్ యజమాని చందుపట్ల వేణుగోపాల్ రెడ్డి సహకారంతో సోమవారం మండలం అకినేపల్లి మల్లారం గ్రామంలో స్థానిక వివేక రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయ ప్రాంగణంలో బందారుగూడెం అకినేపల్లి మల్లారం గ్రామాలలో ఎంపిక చేసిన చిన్న సన్న కారు గిరిజన రైతులకు ఉచితంగా వరి విత్తనాలను జాతీయ మిర్చి బోర్డు డైరెక్టర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాంబశివరెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి సీతక్క ఆదేశాలతో రైతులకు ఉచిత వరి విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వర్షాకాలం సీజన్ లో వ్యవసాయ శాఖ సూచించిన ఏడు సన్న రకాలలో ప్రధానమైన బిపిటి - 5204 సాంబమసూరి సన్నరకం దాన్యం విత్తనాలను మూడు వందల ఎకరాలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతు సోదరులు తెలంగాణ ప్రభుత్వం సూచించిన విధంగా ఎంపిక చేసిన ఏడు రకాల సన్న ధాన్యాన్ని సాగు చేసి క్వింటల్ కి రూ. 500 బోనస్ పొందాలని రైతులకు సూచించారు. అదేవిధంగా అక్టోబర్ మాసంలో వివేక రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యులైన రైతులందరికీ జనతా భీమా సౌకర్యాన్ని కల్పించడంతో పాటు వ్యవసాయ ఉపకరణాలైన బ్యాటరీ స్ప్రేయర్స్, టార్పాలిన్ పరదాలు పంపిణీ చేసేందుకు కసరత్తు చేస్తున్నామని అంతేకాకుండా ములుగు జిల్లా మంగపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలాలలోని ఉద్యమ్ సర్టిఫికెట్ మరియు శిక్షణ పొందిన నిరుద్యోగ యువతకు దాల్ మిల్లులను సబ్సిడీపై పంపిణీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు.ఈ మిషన్లను మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ పంపిణీ చేస్తారని త్వరలోనే దీనికి సంబంధించిన విధివిధానాలు తెలియజేస్తామని తెలిపారు.అనంతరం బందారు గూడెం అకినేపల్లి మల్లారం అడవి రామవరం టి. కొత్తగూడెం గ్రామాలకు చెందిన రైతులకు ఉచిత వరి విత్తనాల కిట్స్ ను సాంబశివరెడ్డి పంపిణీ చేశారు.

### సీతక్క చిత్రపటానికి క్షీరాభిషేకం

వివేక రైతు ఉత్పత్తిదారుల సంఘం నుండి ఉచితంగా వరి విత్తనాలు పొందిన బందారుగూడెం అడవిరామవరం గిరిజన రైతులు సీతక్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు సోయం చెన్నారావు కురసం శ్రీను సోయం సత్యం తదితరులు ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు నాసిరెడ్డి సాంబశివరెడ్డి తమ వివేక ఎఫ్ పి ఓ సంఘం నుండి సుమారు రెండు వందల ఎకరాలకు ఫౌండేషన్ తరగతి బీపీటీ 5204 సన్న రకం వరి వంగడం విత్తనాలను ఉచితంగా పంపిణీ చేసి తమకు విత్తనాల కొనుగోలు ఖర్చు ఆర్థిక భారాన్ని లేకుండా చేసినందుకు కృతజ్ఞతగా మంత్రి సీతక్క చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన రైతు ప్రతినిధులు సోయం చెన్నారావు,కురుసం శ్రీను, సోయం సత్యం, మాల మహానాడు అధ్యక్షుడు రాజమల్ల సుకుమార్,ఆయా గ్రామాల మహిళా రైతులు వివేకా రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.





# ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి

**జర్మన్ భాషా శిక్షణలో యువతకు మంత్రి వివేక్ వెంకటస్వామి సూచన**

**మందమర్రి, జూన్ 22 (క్రైమ్ మిర్రర్):**యువత ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. సోమవారం మందమర్రి పట్టణంలో ఏర్పాటు చేసిన జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అనేక ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, ముఖ్యంగా జర్మనీలో నైపుణ్యం కలిగిన యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. నైపుణ్యాల పెంపొందనకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతిరోజూ సాధన ద్వారా జర్మన్ భాషపై పట్టు సాధించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ శిక్షణ కేంద్రంలో అందిస్తున్న జర్మన్ భాషా శిక్షణను ఏకాగ్రతతో అభ్యసించాలని తెలిపారు. కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంతో పాటు శిక్షణ పూర్తయ్యే నాటికి భాషపై పూర్తి అవగాహన, ప్రావీణ్యం సాధించాలని సూచించారు. విదేశాల్లో లభించే అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో సంబంధిత అధికారులు, శిక్షకులు, ప్రజాప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

# నిబంధనలను ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తీగుళ్ల శ్రీనివాస్**



**చౌటుప్పల్,జూన్ 22,క్రైమ్ మిర్రర్:** చౌటుప్పల్ మండలంలో విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని,చౌటుప్పల్ మండలంలో బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలని సోమవారం జిల్లా ఉన్నతాధికారికి భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ... చౌటుప్పల్ మండలంలో అనేక ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేయడం, విద్యార్థులను బలవంతంగా పాఠశాలలోనే పుస్తకాలు, నోట్బుక్స్, యూనిఫాంలు మరియు ఇతర స్టేషనరీ వస్తువులు కొనుగోలు చేయించే విధానాన్ని వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మండలంలో బీసీ విద్యార్థులకు ప్రభుత్వ హాస్టల్ లేకపోవడం వల్ల పేద, గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యను అందరికీ అందుబాటులో ఉండే హక్కుగా పరిరక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు, జిల్లా కార్యదర్శి లాడియా రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అరవింద్, చౌటుప్పల్ మండలం ఉపాధ్యక్షులు వరుణ్ తేజ్, సతీష్,కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు రవాణాపై పకడ్బందీ నిఘా

- ప్రతి టన్నుపై డిజిటల్ పర్యవేక్షణ
- చోరీల ఆరోపణలు నిరాధారం: జీఎం రాధాకృష్ణ




**మందమర్రి, జూన్ 22 (క్రైమ్ మిర్రర్):** సింగరేణిలో బొగ్గు రవాణా అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా జరుగుతోందని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ తెలిపారు. బొగ్గు మాయమైందని, భారీ స్థాయిలో చోరీలు జరిగాయనే ఆరోపణలు వాస్తవాలకు దూరమని స్పష్టం చేశారు. సోమవారం మందమర్రి జి.ఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ఉత్పత్తి అయ్యే బొగ్గులో 85 శాతం రైల్వే మార్గం ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గంలో వినియోగదారులకు చేరవేస్తున్నట్లు తెలిపారు.బొగ్గు ఉత్పత్తి అయిన క్షణం నుంచి వినియోగదారుడి వద్దకు చేరే వరకు ప్రతి దశలో డిజిటల్ పర్యవేక్షణ, భద్రతా తనిఖీలు, ఆన్‌లైన్ రికార్డింగ్ వ్యవస్థలు అమల్లో ఉన్నాయని చెప్పారు.రోడ్డు మార్గంలో రవాణా అయ్యే ప్రతి వాహనానికి జీపీఎస్, జీపీఆర్ఎస్ ట్రాకింగ్ వ్యవస్థ అమలు చేస్తున్నట్లు తెలిపారు. జియోఫెన్సింగ్ సాంకేతికత ద్వారా వాహనం నిర్దేశిత మార్గం నుంచి మళ్లినా వెంటనే సంబంధిత అధికారులకు హెచ్చరికలు చేరుతాయని పేర్కొన్నారు. వెయిబ్రిడ్జిలు, సీహెచ్‌పీలు, ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లు, రైల్వే సైడింగ్‌లు, స్టాక్‌యార్డుల వద్ద ఆర్ఎఫ్ఐడీ బూమ్ బ్యారియర్లు, సీసీ కెమెరాల ద్వారా 24 గంటలూ పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. అన్ని వెయిబ్రిడ్జిలు కోల్‌నెట్ డిజిటల్ వ్యవస్థతో అనుసంధానమై ఉన్నాయని, లోడింగ్ సమయంలో నమోదైన బరువును అన్‌లోడింగ్ సమయంలో సరిపోల్చి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. తేడాలు గుర్తిస్తే సంబంధిత కాంట్రాక్టర్ల నుంచి నష్టపరిహారం వసూలు చేస్తున్నామని చెప్పారు.బొగ్గు ఉత్పత్తి నుంచి వినియోగదారుడి వరకు ప్రతి టన్ను బొగ్గు ఆర్ఎఫ్ఐడీ, జీపీఎస్, సీసీటీవీ, కోల్‌నెట్, ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జిలు, సింగరేణి సెక్యూరిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్లు, హోలోగ్రామ్ చలానాలు, టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షణలోనే తరలింపవుతోందన్నారు. పారదర్శకత, బాధ్యత, సాంకేతికతే సింగరేణి బొగ్గు నిర్వహణకు మూల సూత్రాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జి.ఎల్. ప్రసాద్, ఎం.డి. ఖాదిర్, డి. రాంబాబు, సంతోష్‌కుమార్, కె. కిరణ్‌కుమార్, డి. విజయ్ సందీప్, డి. ప్రదీప్‌కుమార్, ఆర్. సత్యనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.




# గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు

విద్యార్థులు డ్రగ్స్?? రహిత సమాజానికి కృషి చేయాలి

నేరేడుచర్ల మండల ఎస్ఐ సైదిరెడ్డి



**క్రైమ్ మిర్రర్,హుజూర్ నగర్ (నేరేడుచర్ల):** డ్రగ్స్?? హిత సమాజానికి విద్యార్థులు కృషి చేయాలని నేరేడుచర్ల మండల ఎస్ఐ సైదిరెడ్డి అన్నారు.అంతర్జాతీయ మత్తుపదార్థాల వ్యతిరేక అక్రమ రవాణా నిరోధక దినోత్సవం జూన్ 26 సందర్భంగా జిల్లా ఎస్పి నరసింహ ఆదేశాల మేరకు నేరేడుచర్ల మండల కేంద్రంలో గల గురుకుల పాఠశాల నందు పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మాదకద్రవ్యాల నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం జూన్ 26 సందర్భంగా మండల పరిధిలో వారం రోజులపాటు డ్రగ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థి దశ నుంచే గంజాయి లాంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, జీవితాలను నాశనం చేసే వ్యసనాల బారిన పడకూడదని పిలుపునిచ్చారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక నష్టాలను వివరించారు. గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలు వాడినా, విక్రయించినా లేదా రవాణా చేసినా చట్టపరంగా ఎదురయ్యే కఠినమైన శిక్షలను హెచ్చరించారు. విద్యార్థులు కేవలం చదువు, క్రీడలపైనే దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఎవరైనా మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు డయల్ 100, 112 కు, తెలంగాణ రాష్ట్ర ఈగల్ పోలీస్ టోల్ ఫ్రీ నంబర్ 1908 కి సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు రహస్యంగా ఉంచబడుతాయని తెలిపారు. మత్తుపదార్థాల రహిత సమాజ స్థాపనకు అందరూ కలిసికట్టుగా కృషి చేస్తామని ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ప్రత్యేక ఆకర్షణగా యాంటీ డ్రగ్స్ సోల్జర్ ,సెల్ఫీ స్టిక్.. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో యాంటీ డ్రగ్ సోల్జర్ సెల్ఫీ స్టిక్ ను ఏర్పాటు చేయడం జరిగింది. విద్యార్థులు మేము సైతం మాదకద్రవ్యాల నిర్మూలన సైనికులుగా ఉంటామని సెల్ఫీ స్టిక్ వద్ద ఫోటోలు దిగి పేర్లు నమోదు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిస్లరీ, మైక్రోబాక్స్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూన్ 22:** బిస్లరీ ఇంటర్నేషనల్, మైక్రోబాక్స్ పరిశ్రమల్లో అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడంలో కార్మిక శాఖ మెతక వైఖరి అవలంబిస్తోందని ఆయన విమర్శించారు.పటాన్‌చెరువు మండలం ఐడీఏ పాశమైలారంలోని బిస్లరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్, కొండాపూర్ మండలం మల్లేపల్లి పరిధిలోని మైక్రోబాక్స్ పరిశ్రమల్లో యూనియన్లు ఏర్పాటు చేసుకున్నందుకు కక్షపూరితంగా కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించారని ఆరోపిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. బిస్లరీ పరిశ్రమలో ఐదుగురు, మైక్రోబాక్స్‌లో 13 మంది కార్మికులను చట్టవిరుద్ధంగా తొలగించారని ఆరోపించారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న యాజమాన్యాలపై కార్మిక శాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలగించిన కార్మికులను ఎలాంటి షరతులు లేకుండా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు, బిస్లరీ యూనియన్ అధ్యక్షుడు అతిమేల మానిక్ మాట్లాడుతూ.. కార్మికులు గత 12 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ సమస్యల పరిష్కారానికి అధికారులు స్పందించడం లేదన్నారు. యూనియన్ ఏర్పాటు చేసుకున్నందుకే యాజమాన్యం కక్షపూరితంగా ఉద్యోగాల నుంచి తొలగించిందని ఆరోపించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.సాయిలు, ఉపాధ్యక్షుడు వి.ప్రవీణ్ కుమార్, సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి, వివిధ పరిశ్రమల యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# కోరమ్ లేకుండా జరిగిన గ్రామ సభను మళ్లీ నిర్వహించాలి

కాపుగల్లు గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతి



**క్రైమ్ మిర్రర్ , కోదాడ:** కోరమ్ లేకుండా జరిగిన గ్రామ సభను మళ్లీ నిర్వహించాలని కోదాడ మండలం కాపుగల్లు గ్రామ పంచాయతీ కార్యదర్శికి బీజేపీ కోదాడ రూరల్ మాజీ మండల అధ్యక్షులు దేవరశెట్టి సత్యనారాయణ వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2026 జూన్ 8న నిర్వహించిన గ్రామసభ కోరమ్ లేకుండానే జరిగినట్లు గ్రామస్తుల నుండి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. గ్రామసభ ప్రజాస్వామ్య ప్రక్రియలో అత్యంత కీలకమైన వేదిక కావడంతో, నిబంధనలకు అనుగుణంగా కోరమ్‌తో గ్రామసభ నిర్వహించడం అవసరమని పేర్కొన్నారు.అందువల్ల జూన్ 8న జరిగిన గ్రామసభను పునఃపరిశీలించి, గ్రామ ప్రజలకు ముందస్తు సమాచారం ఇచ్చి, అన్ని నిబంధనలు పాటిస్తూ మళ్లీ గ్రామసభ నిర్వహించాలని కోరారు. అలాగే గ్రామ ప్రజలకు సరఫరా చేస్తున్న గ్యాస్ సిలిండర్లపై ప్రభుత్వం నిర్ణయించిన వాస్తవ ధర మాత్రమే వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదనపు చార్జీలు లేకుండా ప్రతి ఇంటికి గ్యాస్ సిలిండర్లను సక్రమంగా పంపిణీ చేసేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి చర్యలు చేపట్టాలని వినతిలో పేర్కొన్నారు.కాపుగల్లు గ్రామ పంచాయతీ కార్యదర్శిని దేవరశెట్టి సత్యనారాయణ కోరారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారం, పారదర్శక పాలన, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి జరగాలనే ఉద్దేశంతో ఈ వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

# భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు

**మైనంపల్లి హనుమంతరావు దిష్టిబొమ్మ దహనం**



**క్రైమ్ మిర్రర్, నేరేడుచర్ల:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై మైనంపల్లి హనుమంతరావు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బిఆర్ఎస్వి నియోజకవర్గ మాజీ అధ్యక్షులు పల్లెపంగా నాగరాజు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ శ్రేణులు దిష్టిబొమ్మ దహనం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ మాజీ రాష్ట్ర నాయకులు రాపోలు నవీన్ కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ చేతిలో ఘోర పరాజయం పాలైన మైనంపల్లి హనుమంతరావు పూర్తిగా నిరాశ, నిస్పృహల్లో మునిగిపోయి, మతిస్థిమితం లేనట్లు మాట్లాడుతున్నాడనీ అన్నారు. మైనంపల్లి గతంలో టికెట్ కోసం కేటీఆర్ కాళ్ళు మొక్కి టికెట్ రాలేదని పార్టీ వదిలేసి వెళ్ళిపోయావు అని ,నీకు రాజకీయ భిక్షపెట్టిన కేటీఆర్ పైనే కేవలం పదవుల కోసం, నీ స్వార్థ నీచ రాజకీయాల కోసం అడ్డగోలు ఆరోపణలు చేస్తావా అని దుయ్యబట్టారు. సంవత్సరాలుగా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా రాజకీయాలు చేసిన మైనంపల్లి, ఇప్పుడు కాంగ్రెస్ ఐక్యత గురించి మాట్లాడడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ మెప్పు కోసం, పదవుల కోసం అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మరోసారి కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊర్కొనేది లేదని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో యువజన నాయకులు పెరుమాళ్ళ సతీష్ కుమార్, రామ్ సైదులు ,తకెళ్ళ నాగార్జున ,పోలే అనిల్ కుమార్ ,గంగ రాజు ,షేక్ నాగుల్ మీరా ,దీరావత్ శివనాయక్, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌పై దండయాత్ర..బ్రాహ్మణపల్లిలో అవగాహన సదస్సు

**మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజల సహకారం కోరిన ఎస్సై సాంబమూర్తి**

**ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని మహదేవపూర్ ఎస్సై ఎం.సాంబమూర్తి సూచించారు. మహదేవపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సోమవారం మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు కుటుంబాలు, సమాజాన్ని కూడా దెబ్బతీస్తుందని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసలైతే చదువు, ఉద్యోగ అవకాశాలు కోల్పోయి నేరాల వైపు మళ్లే ప్రమాదం ఉందన్నారు. యువత చెడు స్నేహాలు, ఒత్తిడికి లోనై మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తున్నా లేదా వినియోగిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామంలో మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎన్డీపీఎస్ – 1985 చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యాసరచన పోటీలు..

**కేశంపేట (క్రైమ్ మిర్రర్):** మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మై భారత్ రంగారెడ్డి (జిల్లా ) సహకారంతో ప్రపంచ పర్యావరణశీ పై కొత్తపేట జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు సోమవారం నిర్వహించారు. పర్యావరణం పై చక్కని వ్యాసాన్ని రచించిన విద్యార్థులలో విజేతలుగా గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేశారు.ఈ కార్యక్రమం లో యూత్ అధ్యక్షులు మరియు గ్రామ సర్పంచ్ పోచమోని రమేష్ యాదవ్, మై భరత్ ప్రతినిధి శ్రీశైలం యాదవ్ ,ఇన్చార్జి ప్రిన్సిపల్ శ్రీకాంత్, అధ్యాపకులు నాగయ్య, నారాయణ, లక్ష్మీరాజ్, ధ్రువ కుమార్ ,సదానంద గౌడ్, రాణి ,శిరీష ,శ్రీనివాస్, తిరుపతయ్య మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




## ఉప సర్పంచ్ ల సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా రామ్ రెడ్డి



**కేశంపేట,(క్రైమ్ మిర్రర్):** ఉప సర్పంచుల సంఘం షాద్ నగర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని సుందరాపురం గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ రామ్ రెడ్డిని ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప సర్పంచ్ల హక్కుల కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవిని అప్పజెప్పినందుకు నియోజకవర్గ ఉప సర్పంచ్లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు మహమ్మద్ షకీల్, బుర్రి భూపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి జోనల్ కార్యాలయం లో ప్రజావాణికి 39 ఫిర్యాదులు



**సమస్యలను తక్షణమే పరిష్కరించాలి జోనల్ కమిషనర్**

**క్రైమ్ మిర్రర్,మల్కాజిగిరి:** మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జోన్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. మౌలాలి సర్కిల్ మోడల్ సుధా నగర్ కాలనీలో చిన్నపాటి వర్షానికి నాలా పొంగి మురుగునీరు ఇండ్లలో కి వస్తుంది, గతంలో ఎన్నో సార్లు ఇంజనీరింగ్, హైడ్రాధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి స్పందన లేదని జోనల్ కమిషనర్ కు వివరించి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరారు.మొత్తం 39 ఫిర్యాదులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. బాధితుల నుంచి అర్జీలను స్వీకరించిన జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, ప్రజావాణికి వచ్చిన ప్రతి ఫిర్యాదును కూలంకషంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసమే ఆశతో ఇక్కడికి వస్తారని, కాబట్టి ఏ ఒక్క అప్లికేషన్‌ను పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య..

**సర్పంచ్ బీస కవిత కరుణాకర్ రెడ్డి**



**కేశంపేట,(క్రైమ్ మిర్రర్):** విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తే నాణ్యమైన విద్య అందుతుందని, గ్రామంలో ని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తొమ్మిది రేకుల గ్రామ సర్పంచ్ బీస కవితా కరుణాకర్ రెడ్డి కోరారు. సోమవారం మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామంలో సర్పంచ్ బీస కవితా కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోట్ బుక్కులు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా చేరిన నలుగురు విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించి పాఠశాలలో చేరిన విద్యార్థినిలకు రెండు వేల రూపాయలు, విద్యార్థులకు పదిహేనువందల రూపాయలు పారితోషకాన్ని అందజేయడం జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి పారితోషకం ఇవ్వడం జరిగిందని, అదేవిధంగా పాఠశాలలో అన్ని మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులందరూ ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యాంసుందర్, దేవేందర్ రెడ్డి ,పవన్ కుమారి , వార్డు సభ్యులు కందిన సంతోషా శివయ్య, నాగిళ్ల ప్రేమలత యాదయ్య ,గ్రామస్తులు చిట్టి రెడ్డి వెంకట్ రెడ్డి, గుత్తి శేఖర్, భీమ్ రెడ్డి సుధాకర్ రెడ్డి, మట్ట వెంకటయ్య ,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.